క్లుప్తంగా

సామాజిక ఆర్థిక పరిస్థితులపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న విద్యార్థులు

కొత్తూరు: మల్లాపూర్ గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు సామాజిక ఆర్థిక పరిస్థితులపై సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులు రైతులు, ప్రజల వద్దకు వెళ్లి గ్రామంలో సాగు చేస్తున్న పంటలు, మార్కెట్ సదుపాయాలు, ఎరువుల వినియోగంపై వివరాలు సేకరించారు. పంట విక్రయం అనంతరం రైతుల ఆర్థిక పరిస్థితులపై పలు వివరాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ నరేందర్‌రెడ్డి, శకుంతలదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్



షాబాద్ ఆశ వర్కర్ల నూతన కమిటీ

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో ఆశ కార్యకర్తల నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, బీమా కల్పించాలన్నారు.

నూతన కమిటీ..

మండల అధ్యక్షురాలిగా కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలిగా బాలమణి, ప్రధాన కార్యదర్శిగా మాధవి, కోశాధికారిగా జయమ్మ, సహాయ కార్యదర్శిగా లక్ష్మీతో పాటు 15 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని వినతి



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతి పత్రం అందిస్తున్న సిబ్బంది

శంకర్‌పల్లి: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు, వరుణ్, మహేందర్, రాజ్‌కుమార్, బీర్ల సాయి, సోహెల్, రాఘవేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి నిరంతర కృషి

ఎంపీటీసీ బొల్లారం ప్రవళిక



పనులను ప్రారంభిస్తున్న ప్రవళిక

శంకర్‌పల్లి: గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ప్రొద్దటూరు ఎంపీటీసీ బొల్లారం ప్రవళిక పేర్కొన్నారు. శనివారం సర్పంచ్ ఏనుగు నర్సింహారెడ్డితో కలిసి అండర్‌డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు బొల్లారం వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు రావాలని ఎంపీకి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఈ నెల 17వ తేదీన చేవెళ్ల మండలకేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డికి మండల గౌడ సంఘం నాయకులు ఆహ్వానం పత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో మల్గారి రమణారెడ్డి, మర్పల్లి క్రిష్టారెడ్డి, పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

స్నేహమేరా..జీవితం

స్నేహానికి కులం లేదు. మతం లేదు. చిన్నప్పుడు ఆడుకోవడానికి, పెరిగి పెద్దవాళ్లయ్యాక ఒకరి నొకరు కష్ట సుఖాలు పాలు పంచుకుంటాం. మంచి, చెడు, బాధాల్ని ఒక్క స్నేహితునితోనే చెప్పుకుంటాం. జీవితంలో తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు తెలియని ఎన్నో విషయాల గురించి స్నేహితునితోనే మాట్లాడుకుటాం. ఎన్నో మరుపురాని క్షణాలు ఫ్రెండ్షిప్‌లోనే దాగి ఉంటుంది. అందుకే సమాజంలో స్నేహానికుండే విలువ దేనికిలేదనే విషయం సుస్పష్టం. యువత మనోగాథ స్నేహితుల దినోత్సవం సందర్భంగా మీ కోసం ఈ కథనం..



నేడు స్నేహితుల దినోత్సవం

షాబాద్: కష్ట, సుఖాల్లో పాలు పంచుకునే వాడే నిజమైన స్నేహితుడని అంటారు. కష్టం వచ్చినప్పుడు నీ ప్రక్కన ఉండే మనుషులు వెళ్లిపోయినా, నా అనుకునే వాళ్లు లేకపోయినా చెక్కు చెదరని స్నేహితుడే వెంటే నిలుస్తాడు. అదే స్నేహానికి ఉన్న గొప్ప శక్తి. అందుకే కాబోలు కొందరు తల్లిదండ్రులను మించి స్నేహితులను నమ్ముతారు. అందుకే స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం. స్నేహానికన్నా మిన్నా లోకాన లేదురా.. అని ఓ కవి పాటగానే రాశాడు. స్నేహానికి వయస్సుకు సంబంధం లేదు. నడక నేర్చిన చిన్నారుల నుంచి పండు ముసలి వరకు స్నేహ మాధుర్యాన్ని ఆస్వాదించినవారే.

వెలకట్టలేనిది..



స్నేహమనేది ఎంతో మధురమైంది. మంచి స్నేహం మంచి జీవితాన్ని ఇస్తుంది. స్నేహానికి కుల, మత, తారతమ్యం లేదు. స్నేహంలో స్వార్థం ఉండదు. అమ్మనాన్నల తరువాత దేవుడిచ్చిన బహుమతి స్నేహితుడు. భవిష్యత్తును తీర్చదిద్దడంలో ఆపదలో ఆదుకోవడంలో స్నేహితుల పాత్ర కీలకం. వీలు చిక్కినప్పుడల్లా మిత్రులతోనే ఎక్కువ సమయం గడుపుతాను. సమాజంలో వెలకట్టలేనిదే స్నేహం.

–కుమ్మరి చెన్నయ్య, సంకెపల్లిగూడ,

స్నేహానికి మరణం లేదు..



మిత్రుడు లేని జీవితం వృథా. వెన్నుతట్టి నడిపేవాడే స్నేహితుడని అంటారు. మనిషికి ఎన్నో బంధాలు కష్ట, నష్టాలు వచ్చిపోతాయి. కాని స్నేహం బతికున్నంత సేపే కాకా, లోకం ఉన్నంత వరకు స్నేహం ఉంటుంది. జీవ కోటిలో పశుపక్ష్యాదులకు కూడా స్నేహం ఉందంటే దాని విలువ ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. కాబట్టి స్నేహానికి మరణం లేదు.

–పట్నం అవినాశ్‌రెడ్డి, జెడ్పీటీసీ, షాబాద్

కష్టాల్లో ధైర్యం నూరిపోస్తాడు.. పక్కనే ఉంటాడు..



కష్ట సమయంలో ధైర్యం చెబుతాడు. అవసరమైతే అండగా ఉంటాడు. నేను న్నానని ఆపద సమయంలో సంకేతమిస్తాడు. ఓటమిలో కూడా గెలవడానికి కొండంతా ప్రోత్సాహాన్ని నింపగల సమర్థుడు. ఎంత చెప్పినా స్నేహం గురించి తక్కువే. దేనైనా కొనగలం కానీ స్నేహాన్ని మాత్రం కొనలేం. అదే కదా నిజమైన స్నేహం.

– గంగిడి భూపాల్‌రెడ్డి, హైతాబాద్

ఆదర్శంగా నిలవాలి



మా స్నేహితుడు గుండె పోటుతో మృతి చెందినందునా అతని కుటుంబానికి వారి అవసరాల నిమిత్తం, ఆర్థిక పరిస్థితిని చూడలేక రూ. 5లక్షలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. అతని కుటుంబానికి మేము ఐదు మంది కలిసి బ్యాంకులో జమ చేశాం. అతని భార్య పిల్లలు అనాథలు కాకుండా మావంతు సహాయం చేశాం. ఇలా స్నేహమనేది ఆదర్శంగా నిలవాలని మా కోరిక.

– శివకుమార్‌రెడ్డి, సీఈఓ, షాబాద్

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

డాక్టర్ స్రవంతి

షాద్‌నగర్‌రూరల్: పోషకాహారం తీసుకుంటేనే ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని చించోడ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ స్రవంతి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ఆశా డే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సు కలిగిన అమ్మాయిలను గుర్తించి వారికి రక్త పరీక్షలు చేయాలని సూచించారు. యుక్త వయస్సులో ఉన్న బాలికల్లో రక్త హీనతను గుర్తించి వారికి ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. సీజన్‌ల్లో దొరికే పండ్లను తినాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణీలను గుర్తించి వెంటనే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. డాక్టర్ ఆనంద్, డాక్టర్ కార్తీక్, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, రమ, చంద్రకళ, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ స్రవంతి

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మాజీ ఎమ్మెల్యే, పీసీసీ సభ్యుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ నాయకులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల సమీపంలోని జీపీఆర్ ఫామ్‌హౌస్‌లో శుక్రవారం రాత్రి ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేఎల్ఆర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, టీపీసీసీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, చింపుల సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన ఎజెండాగా కెఎల్ఆర్‌ను చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి నిలబెట్టాలని సభ్యులు పట్టుబట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకునేందుకు కష్టపడి పనిచేద్దామని వారు తీర్మానించుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఇతర పార్టీలనుంచి వచ్చే వారినుద్దేశించి మాట్లాడారు. తనపై అభిమానంతో ఇంత మంది వచ్చినందుకు కెఎల్ఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, సూర్యపేట శ్రీనివాస్, పెంటయ్యగౌడ్, శ్రీనివాస్, పి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కేఎల్ఆర్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవానాయ్
- ఔట్‌సోర్సింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల ధర్నా

చేవెళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా జీతాలు ఇవ్వాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి దేవానాయ్ పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దేవానాయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 134 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయని ఔట్‌సోర్సింగ్ నాన్ టీచింగ్ పద్ధతిలో 341 మంది వివిధ పోస్టుల్లో పని చేస్తున్నారన్నారు. ప్రతీ నెల జీతాలు సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమకు జీతాలు చెల్లించాలన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా ప్రభుత్వం నుంచి తమకు జీతాలు అందేలా చూడాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ అందరికీ రెగ్యూలరైజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ ధర్నాలో సంఘం ప్రధాన కార్యదర్శి రమేశ్‌బాబు, ఉపాధ్యాక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు రామనాని సునిత, వివిధ కళాశాలల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

అధికారుల గైర్హాజరు బాధాకరం

జెడ్పీవైస్ చైర్మన్ గణేష్

- పరిష్కారానికి నోచని కాలుష్య నియంత్రణ, ఆర్టీసీ సమస్యలు



మాట్లాడుతున్న గణేష్

నందిగామ: మండల అభివృద్ధిపై ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరుకాకపోవడం బాధాకరమని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ ప్రియాంక ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం జెడ్పీవైస్ చైర్మన్ గణేష్ మాట్లాడుతూ గత కొన్ని మండల సమావేశాలకు కాలుష్య నియంత్రణ, ఆర్టీసీతో పాటు పలు శాఖల అధికారులు గైర్హాజరవుతుండడంతో ఆ శాఖల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఈ విషయంపై సదరు అధికారులపై ఫిర్యాదు చేస్తామన్నారు. చాకలిగుట్టతండా, తాటిగడ్డతండాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను కోరారు. రైతులు పండిస్తున్న పంటల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సర్వేలు చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పాత జాతీయ రహదారి నుంచి వీర్లపల్లి మీదుగా మామిడిపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పనులను ఎమ్మెల్యే సహకారంతో త్వరలో ప్రారంభిస్తామన్నారు. అనంతరం సర్పంచులు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టులు



పోలీసుల అదుపులో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు

చేవెళ్ల: యువజన కాంగ్రెస్ అసెంబ్లీ సమావేశాల ముట్టడిని పిలుపునివ్వడంతో వారిని పోలీసులు శనివారం ముందస్తుగా అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసులచేత అరెస్టులు చేయించడం బాధాకరమన్నారు. అరెస్టయిన వారిలో ఎన్ఎస్‌యుఐ కోఆర్డినేటర్ కరుణాకర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుశాంత్, ఎన్ఎస్‌యుఐ నాయకులు భాను, శాంసన్, తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

రుద్రారం సర్పంచ్ బండ స్వర్ణలత

షాబాద్: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంగా కార్పొరేట్ ఆసుపత్రిలు కృషి చేయాలని రుద్రారం సర్పంచ్ బండ స్వర్ణలత పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో కన్సర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీఎంఆర్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కన్సర్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు, పీఎంఆర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

పశువులకు టీకాలు తప్పనిసరి

షాబాద్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, షాబాద్ డాక్టర్ స్రవంతి అన్నారు. శనివారం మద్దూరులో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్త వహించాలని సూచించారు. పాడి ఆవులు, గేదెలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టిందన్నారు.



షాబాద్: మద్దూరులో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

తప్పని ట్రాఫిక్ తిప్పలు

ఇబ్బందుల్లో వాహనదారులు



అజీజ్‌నగర్ చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అప్పా మొదలుకొని కనకమామిడి చౌరస్తా వరకు నిత్యం ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్–బీజాపూర్ రహదారి, మొయినాబాద్ ప్రధాన రహదారి గుండా ఎంతో మంది ప్రయాణిస్తున్నారు. వారు నిత్యం ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం మొయినాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించిన జెడ్పీ చైర్‌పర్సన్ అనితరెడ్డి కూడా ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొన్నారు. ఈ రహదారి గుండా వాహనాదారులు నిత్యం వెళ్తుంటారు. దీంతో వారికి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు మేలు

చేవెళ్ల: తల్లిపాలు బిడ్డకు మేలు చేస్తాయని చేవెళ్ల ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి అన్నారు. శనివారం చేవెళ్ల మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు ఉమారాణి, ప్రవీణ, అఫియానూర్జహాన్, అనురాధ పాల్గొన్నారు.

వరద కాల్వకు ‘రియల్’ అడ్డుకట్ట

షాద్‌నగర్‌రూరల్: వర్షాలు కురిస్తే చెరువులు నిండుతాయి. నిండిన చెరువు పారితే వరద కాల్వద్వారా సాగు నీరు అందుతుంది. కానీ కొందరు రియల్ వ్యాపారులు వరద కాల్వకు అడ్డుకట్ట వేశారు. వర్షపు నీరు దిగువకు వెళ్లకుండా చేశారు. ఈ విషయమై గత 10 రోజులుగా దళిత రైతులు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. వరద కాల్వకు అడ్డంగా నిర్మించిన అడ్డుకట్ట తీసివేయాలని, లేనియెడల దళిత రైతులతో ఆందోళన చేపడతామని ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు భీష్వరామకృష్ణ అధికారులను నిలదీశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు భీష్వరామకృష్ణ మాట్లాడుతూ చెరువు నిండితే కాల్వకు నీరు చేరకుండా అడ్డంగా మట్టిని పోశారని, దీన్ని తొలగించాలని గత 10 రోజులుగా దళిత రైతులు అడుగుతున్నా ఇరిగేషన్ అధికారులు రియల్ వ్యాపారికి కొమ్ము కాస్తూ రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయం గురించి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు భీష్వకిష్టయ్య, బక్కనినర్సింలకు చెప్పినా ఫలితం లేదని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా వరద కాల్వకు అడ్డుగా వేసిన మట్టిని ఎందుకు తొలగించరని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా మట్టిని తొలగించి రైతులకు న్యాయం చేయాలని, లేని యెడల ఎంపీడీఓ కార్యాలయం ముందు బైఠాయిస్తానని ఆయన హెచ్చరించారు. అనంతరం ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ పార్థసారథి, పంచాయితీరాజ్ ఏఈ గోపాల్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, వైస్ ఎంపీపీ మౌనికహరికృష్ణగౌడ్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, పీఆర్ డీఈ చిరంజీవులు, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఏపీఓ అరుణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



వరద కాల్వకు అడ్డుగా మట్టిని పోసిన ఫొటోలను చూపుతున్న భీష్వరామకృష్ణ

సమస్యలు పరిష్కరించాలని వినతి

మొయినాబాద్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ కార్యదర్శి రత్నం పేర్కొన్నారు. శనివారం అజీజ్‌నగర్ గ్రామానికి విచ్చేసిన జెడ్పీచైర్ పర్సన్ అనితరెడ్డి, ఎంపీపీ నక్షత్రంజేవంతు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్‌లకు మండల సీఐటీయూ కార్యదర్శి రత్నం, సర్పంచ్ సంధ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మొరపెట్టుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితరెడ్డి మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రత్నం, సుధాకర్, బాలయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే న్యాయం

ఆమనగల్లు: ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సూచించారు. అధికారమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ పాలనలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మహేశ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, మాడ్గుల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దళపతిగౌడ్, నాయకులు జంగయ్యగౌడ్, శివ, భానుకిరణ్, సురేశ్‌గౌడ్, నవీన్, అభినవ్, రమేశ్, వసురాం, ఆంజనేయులు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ క్లబ్‌గా ‘ఆమనగల్లు లయన్స్’

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ 320ఎ పరిధిలో చేపట్టిన వివిద సామాజిక కార్యక్రమాలకు గాను ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉత్తమ క్లబ్‌గా ఎంపికై ంది. వివిధ విభాగాలలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు మొత్తం 25 అవార్డులు వరించాయి. హైదరాబాద్‌లోని గ్రీన్‌లాండ్స్‌లో శనివారం జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎ పురస్కార్ అవార్డుల కార్యక్రమంలో వివిధ లయన్స్‌క్లబ్‌లకు లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరి రఘు అవార్డులు అందించారు. ఇందులో 2022–23 సంవత్సరానికి ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉత్తమ లయన్స్‌క్లబ్‌గా నిలిచింది. అలాగే ఉత్తమ అధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి, కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా కొండల్‌రెడ్డి, పీఆర్‌ఓగా పాష, బెస్ట్ జోన్ చైర్మన్‌గా కసిరెడ్డి రాంరెడ్డిలు అవార్డులు అందుకున్నారు. నరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, రమేశ్‌బాబు, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ పాల్గొన్నారు.